بِسْمِ اللّٰہِ الرَّحْمٰنِ الرَّحِیْمِ نَحْمَدُہٗ وَنُصَلِّی عَلٰی رَسُوْلِہِ الْکَرِیْمِ وَعَلٰی عَبْدِہِ الْمَسِیْحِ الْمَوْعُوْدِ

# Summary of Friday Sermon Huzur-e-Anwar 24.07.2015 (Telugu)

**విశ్వాస, ఆచరణ పరంగా హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం మనలను సిద్ధము చేయదలచి విధముగా మనము సిద్ధము కావలెను. మన పృథ్వీ కూడ క్రొత్తగా కావలెను. మన ఆకాశము కూడ క్రొత్తగా కావలెను. నూతన పృథ్వీ, నూతన ఆకాశము సిద్ధము చేయుటలో హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంనకు మనము సహాయకులు కావచ్చును.**

*హజ్రత్ అమీరుల్ ముమినీన్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తాలా బినస్రిహిల్ అజీజ్ 24.07.2015 తేదీన ఫ్రంక్‌ఫర్ట్ - జర్మనీలో ప్రసంగించిన ఖుత్బా జుమా సారాంశము*

తషహ్హుద్, తఅవ్వుజ్, తస్మియ, సూర ఫాతిహా పఠనానంతరం హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లు ఉపదేశించిరి.

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం, వారి అనుచరుల గురించి హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ రజియల్లాహు అన్హు తెలిపిన పలు సంఘటనలను నేనిప్పుడు ప్రస్తావింతును.

'తజ్కిరహ్' (పుస్తకము)లో 9 ఫిబ్రవరి 1908 తేదీన ఒక దైవవాణి "లా తక్తులూ జైనబ" వ్రాసియుంది. దీని నేపథ్యమును హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ రజియల్లాహు అన్హు ఇట్లు వివరించిరి. క్రీ.శ. 1908 ఆరంభములో స్వర్గీయ హాఫిజ్ అహ్మదుల్లాహ్ ఖాన్ గారి ఇద్దరు కుమార్తెల వివాహము కుదిరినది. వారిలో పెద్ద కూతురు పేరు జైనబ్, చిన్న కూతురు పేరు కుల్సూమ్. జైనబ్‌ను మరి కొందరు కూడ ఇష్టపడిరి. ఒక సంబంధము షేఖ్ అబ్దుర్రహ్మాన్ నుండి కూడ వచ్చెను. జైనబ్ వివాహము వారితో జరగకూదని హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం తలచిరి. కాని తమ అలవాటు ప్రకారము అంతగా పట్టుపట్టలేదు. అదే రోజులలో హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం "లా తక్తులూ జైనబ" అనగా జైనబ్‌ను హతమార్చవద్దని దైవవాణి అందినది. హాఫిజ్ అహ్మదుల్లాహ్ ఖాన్ గారు రెండవ వ్యక్తిని ఏదో కారణముచే ఇష్టపడలేదు. అక్కడ వివాహము జరుపకూడదను హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారి సలహా సముచితము కాదు, మిస్రి గారితో వివాహము చేయాలని ఈ దైవవాణి భావమని వారు భావించిరి. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం సలహాను దైవవాణి రద్దు చేసినదని ఊహించిరి. అనంతరం వారు తమ కూతురు వివాహము మిస్రి గారితో చేసిరి. ఈ దైవవాణి 9 ఫిబ్రవరి 1908 తేదీన అందినది. 17 ఫిబ్రవరి 1908 తేదీన జైనబ్ వివాహము మిస్రి గారితో జరిగినది. హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ (రజి) ఇట్లు తెలిపిరి. ఈ తేదీ ఎలా గుర్తున్నదనగా ఇదే తేదీన మరో రెండు వివాహములు జరిగినవి. అదే రోజు అనగా 17వ తేదీన మా సోదరి ముబారక బేగం వివాహము కూడ అయ్యెను. ఈ వ్యక్తి ద్వారా తర్వాత చాలా పెద్ద ఉపద్రవము ఏర్పడునని అల్లాహ్ తఆలా తన అభీష్టమును తెలిపెను. ఎందుకనగా తదుపరి కాలములో మిస్రి గారితో చాలా పెద్ద ఉపద్రవము ఏర్పడినది. అతనితో జైనబ్ వివాహము జరిపించకుము. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం సలహాను పాటించుము. హాఫిజ్ అహ్మదుల్లాహ్ ఖాన్ గారికి ఇదే సలహా హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇచ్చినట్లు సాక్ష్యములు గలవు. మిస్రి గారు జమాఅత్ నుండి

విడిపోయినప్పుడు పీర్ మన్జూర్ ముహమ్మద్ గారు నాకిట్లు వ్రాసి పంపిరి. షేఖ్ అబ్దుర్రహ్మాన్ గారితో వివాహము చేయకూడదని హాఫిజ్ అహ్మదుల్లాహ్ ఖాన్ గారితో నా ముందు హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం అనిరి. కాని హాఫిజ్ గారు ఈ విషయమును వినక వారితో వివాహము జరిపినప్పుడు నాకు చాలా కోపమొచ్చెను. నేను హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం సేవలో హాజరై హుజూర్ దైవ అవతారులు, అవతారులు ఒక విషయము చెప్పినప్పుడు అనుచరులు పాటించాలని దైవ ఆదేశము గలదని నేనన్నాను. కనుక హాఫిజ్ అహ్మదుల్లాహ్ గారు హుజూర్ పట్ల అవిధేయత వహించిరి. అందుకు హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం ఇట్లనిరి. మీరు చెప్పిన విషయము సబబే. కాని నేను ఇటువంటి విషయములలో జోక్యము చేసుకోను. ఒక సారి హజ్రత్ ఖలీఫా అవ్వల్ (రజి) కాలములో షేఖ్ మిస్రి గారు తమ మామయ్యను వీధిలో కొట్టిరి. అందుకు హజ్రత్ ఖలీఫా అవ్వల్ (రజి) చాలా రోజుల వరకు మిస్రి గారితో కోపముతో యుండిరి. నేను చాలా రోజులు విన్నవించి వారిని క్షమింపజేసితిని.

మీరు జైనబ్ వివాహము షేఖ్ మిస్రి గారితో చేయకూడదని, లేనిచో ఆమె విశ్వాసము కూడ వృథా అగునని ఈ దైవవాణి భావము యుండెను. ఈ వివాహము వలన ఆమె విశ్వాసము కూడ వృథా అయినదని తర్వాతి సంఘటనల ద్వారా రుజువైనది.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. మిస్రి గారి గురించి చాలా మందికి తెలియనందున కొంత వివరణ ఇచ్చెదను. షేఖ్ అబ్దుర్రహ్మాన్ మిస్రి గారు హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం బైఅత్ చేసిరి. విద్యావంతులు. హజ్రత్ ముస్లిహ్ మౌఊద్ రజయల్లాహు తఆలా అన్హు, చౌధ్రి నస్రుల్లాహ్ ఖాన్ గారు ఖర్చులిచ్చి మిస్ర్ (ఈజిప్టు) పంపిరి. వారు ఈజిప్టు వెళ్లగా కొంత ప్రయోజనము కూడ కలిగినది. మిస్ర్ పోయినందుకు మిస్రి అనబడిరి. తర్వాత ఒకప్పుడు హజ్రత్ ముస్లిహ్ మౌఊద్ రజయల్లాహు తఆలా అన్హు గారిని వారు విభేదించిరి. ఈ విభేదము వలన వారికి వ్యతిరేకంగా చాలా మాట్లాడిరి. జమాఅత్‌లో ఉపద్రవము సృష్టించుటకు ప్రయత్నించిరి. కాని అల్లాహ్ తఆలా జమాఅత్‌ను రక్షించెను. వారి స్థితి ఏమిటో జమాఅత్‌లోని పలు సభ్యులకు వ్యక్తిగతంగా సత్యస్వప్నము ద్వారా కూడ అల్లాహ్ తఆలా తెలిపెను. జమాఅత్‌లో మిస్రి గారికి ఎంత స్థానము యుండెనో దానిని ఇట్లు అంచనా వేయవచ్చును. హజ్రత్ ముస్లిహ్ మౌఊద్ రజయల్లాహు తఆలా అన్హు స్వయముగా ఇట్లనిరి. ఆఫ్రీకా నుండి ఒక మిత్రుడు నాకిట్లు ఉత్తరము వ్రాసెను. మిస్రి గారు జమాఅత్ నుండి విడిపోయినందుకు నాకు చాలా భయము కలుగుచున్నది. ఇంత గొప్ప వ్యక్తి విశ్వాసము వృథా అయినప్పుడు మా విశ్వాసము ఏ స్థాయి కలిగినది. వారికి నేనిట్లు సమాధానమిత్తిని. ఎవరు గొప్పో నిర్ణయించేది అల్లాహ్ తఆలా. మీరు గొప్పగా భావించేవారిని అల్లాహ్ తఆలా జమాఅత్ నుండి దూరము చేసి, మిమ్ములను జమాఅత్‌లో వుంచినప్పుడు గొప్ప వారు కాదు మీరైనారు. మిస్రి గారు జమాఅత్‌లో వున్నంత వరకు చాలా గొప్పగా భావించబడే వారు కాని నేడు వారే స్థాయిని కలిగి లేరు.

సందేశహరుని విషయములను పాటించుట విశ్వాసుల కర్తవ్యము. వాటిని అర్థము చేసుకొని అక్షరాలలో ఇతర భావాలను వెతకనిచో విశ్వాసము వృథా కాదు.

హజ్రత్ ముస్లిహ్ మౌఊద్ రజియల్లాహు తఆలా అన్హు మరో సంఘటన ఇట్లు తెలిపిరి. మౌల్వీ ముహమ్మద్ అహ్సన్ గారి స్వభావములో చాలా తొందర పాటు యుండెను. ఒక సారి హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం బస్రాంవా వైపు పాద విహారానికి వెళ్లిరి. అల్లాహ్ తఆలా వాక్యము, దాసుని వాక్యములో

చాలా తెడా యుండునని వారనిరి. వారు అలైహిస్సలాం తమ ఒక దైవవాణిని వినిపించి, ఇది కూడ ఒక దైవవాణి, దీనికి ఎదురుగా హరీరీ వాక్యము కూడ గలదని అనిరి. మౌల్వీ ముహమ్మద్ అహ్సన్ గారు ఈ విషయములోని తుది భాగమును శ్రద్ధగా వినలేదు. దైవవాణిని హరీరీ వాక్యమని భావించిరి. చాలా అవివేకమైనదని అనిరి. ఇది దైవవాణి అని హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం అనగా మౌల్వీ గారు సుబ్హానల్లాహ్ ఎంత గొప్ప వాక్యమని అనిరి.

ఏదేని విషయము గురించి తొందరపాటుతో ఒక అభిప్రాయానికి రాకూడదు. హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ రజియల్లాహు అన్హు ఇట్లనిరి. మౌల్వీ ముహమ్మద్ హుసేన్ బటాల్వీ గారు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారి మిత్రులు. వారి ప్రకటన తర్వాత నేనే ఈ వ్యక్తిని పైకి లేపినాను, ఇప్పుడు నేనే ఈ వ్యక్తిని పడవేయుదునని అనెను. కాని అల్లాహ్ తఆలా వారి అనగా మౌల్వీ ముహమ్మద్ హుసేన్ నామమును అంతము చేసి హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం నామమును ప్రపంచములో వ్యాపింపజేసెను. మౌల్వీ ముహమ్మద్ హుసేన్ గారి ఒక కుమారుడు ఆర్యునిగా మారెను. నేను అతన్ని ఖాదియాన్ పిలిపించి మరల ముస్లింగా మార్చితిని. అందుకు మౌల్వీ ముహమ్మద్ హుసేన్ నాకు కృతజ్ఞతా ఉత్తరము కూడ వ్రాసెను.

అంతర్గత, బాహ్య శత్రుత్వములను ప్రస్తావించుచు హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ రజియల్లాహు తఆలా అన్హు ఇట్లనిరి. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం హయాం నుండి వ్యతిరేకత ఎదురగుచున్నది. అయినను జమాఅత్ అభివృద్ధి చెందుచున్నది. వాస్తవానికి నేటికి కూడ వివిధ కుట్రల, మోసముల పరంపర కొనసాగుచున్నట్లు మనము చూచుచున్నాము. కాని అల్లాహ్ తఆలా కృపానుసారము జమాఅత్ ప్రగతి చెందుచున్నది. జమాఅత్ ముండ్లపై నడుచుచు ఈ స్థితికి చేరినది. అల్లాహ్ తఆలా అనుగ్రహము సదా జమాఅత్‌తో యున్నదని ఈ విషయము స్పష్టము చుయుచున్నది. కాని ఈ అనుగ్రహమును శాశ్వతముగా మార్చుటకు జమాఅత్ ఎల్లప్పుడు దుఆలలో నిమగ్నము కావలెను. మనము దుఆల హక్కు చెల్లించినచో ప్రస్తుత, భవిష్యత్తులో సంభవించే అన్ని వ్యతిరేకతలు వాటంతటఅవే అంతమగును. ఇన్షాఅల్లాహ్.

ఒక సందర్భమున హజ్రత్ మౌల్వీ అబ్దుల్ కరీం రజియల్లాహు అన్హు గారి సాటిలేని త్యాగమును ప్రస్తావించుచు హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ రజియల్లాహు అన్హు ఇట్లనిరి. హజ్రత్ ఖలీఫా అవ్వల్ రజియల్లాహు అన్హుకు అల్లాహ్ తఆలా ఒక గొప్ప ఉద్యోగము ప్రసాదించి యుండెను. అది ముగియగానే వారు తమ స్వస్థలములో వైద్యము మొదలు పెట్టిరి. అక్కడ వారు ఖ్యాతి గడించి యుండిరి. వారి స్వస్థలము భేర. అది సర్గోధా జిల్లాలో యున్నది. అక్కడ పెద్ద పెద్ద భూస్వాములు యున్నారు. అక్కడ అధికులు వారి అభిమానులే. అక్కడ వైద్యము బాగా నడిచే అవకాశముండెను. కాని వారు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాంతో భేటి అగుటకు ఖాదియాన్ వచ్చిరి. కొన్ని రోజుల తర్వాత తిరిగి పోవుటకు సంకల్పించగా మీరు చాలా ప్రపంచమును చాలా చూచినారు, ఇక ఇక్కడే వుండగలరని హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం అనిరి. వారు ఆ ఆదేశమును పాటించిరి. ఎంత గొప్పగా పాటించిరనగా సామాగ్రి తీసుకొనుటకు స్వయముగా తాము కూడ పోలేదు. వేరే వ్యక్తిని పంపి తెప్పించినారు. ఆ కాలములో ఇక్కడ వైద్యము నడిచే అవకాశము లేకుండెను. వాస్తవానికి ఒక్క పైసా ఇచ్చే స్థోమత గల వ్యక్తి కూడ ఇక్కడ లేకుండెను. కాని వారు దేనిని లెక్క చేయలేదు. కాని వారు ప్రఖ్యాతులైనందున బయటి నుండి కూడ రోగులు వారి వద్దకు వచ్చేవారు. ఈ విధముగా ఏదో ఒక రకముగా ఆదాయము లభించేది. కాని హజ్రత్ మౌల్వీ అబ్దుల్ కరీం రజియల్లాహు అన్హు గారి త్యాగము

ఎట్లుండెననగా ఏ విధముగాను ఆదాయము లభించే అవకాశము లేకుండెను. ఏదేని రుసుము, జీతము వేతనము లేకుండెను. ఏ మార్గమున కూడ ఎలాంటి ఆదాయము లేకుండెను. అయినను హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం కార్యదర్శిగా పని చేసేవారు. ఇప్పుడు పని చేయుచున్న జమాఅత్ శాఖల పనులన్ని అప్పుడు వారొక్కరే చేసేవారు. కాని ఎలాంటి ఆదాయము లేకుండెను. ఈ త్యాగము నిర్మానుష్య ప్రాంతములో ప్రాణ త్యాగము వంటిది. మన పూర్వీకుల ఉదాహరణలివి. జీవితాంకితులమైన మనము కూడ వీటిని స్మరించుకొనుచు అప్పుడప్పుడు గుర్తు చేసుకోవలెను.

నమాజ్ తర్వాత నేనొక పరోక్ష అంత్యక్రియ ప్రార్థన చదివింతును. ఇది కీ.శే. మౌల్వీ ముహమ్మద్ యూసుఫ్ దర్వేష్ ఖాదియాన్ గారిది. 22 జూలై 2015 తేదీన 94 సం॥ల వయసులో వీరు మృతి చెందిరి. انا للہ وانا الیہ راجعون వారు తమ వంశములో ఒక్కరే అహ్మదీయులైరి. మదర్సా అహ్మదియ్యలో సుదీర్ఘ కాలము వరకు పవిత్ర ఖుర్‌ఆన్, హదీసు బోధించే అవకాశము లభించినది. చాలా నిరాడంబరులు, బాధ్యత గల, విధేయులు, విశ్వసనీయులుగా సేవలందించిరి. వీరు జిల్లా లాహోర్ అనగా ప్రస్తుత ఖసూర్ జిల్లాలోని తహ్‌సీల్ చోనియాంలోని ముఖక్కల్ పట్టణ నివాసులు. వారు ప్రాథమిక విద్య తమ గ్రామములోనే అభ్యసించిరి. అనంతరం క్రీ.శ.1939లో లాహోర్‌లోని అహ్లె హదీస్ కళాశాలలో హదీస్ ప్రాథమిక పుస్తకములను చదివిరి. అక్కడ ఒక అహ్మదీయునితో వారు కలిసినందున అహ్మదియ్యత్ గురించి వారికి తెలిసినది. సత్యశోధన కొరకు అనేక సార్లు వారు ఖాదియాన్ వచ్చిరి. పుస్తకములను పఠించిరి. తుదకు క్రీ.శ.1944లో హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ రజియల్లాహు అన్‌హు హస్తమున బైఅత్ చేయు అనుగ్రహము పొందిరి. తదనంతరం ధార్మిక విద్యాభ్యాసం కొరకు ఖాదియాన్ వచ్చి, ముబల్లిఘీన్ తరగతిలో ప్రవేశము పొందిరి. చదువుచుండగానే దేశ విభజన జరిగెను. వారు ఖాదియాన్‌లో యుండుటకే ప్రాధాన్యతనిచ్చి, సాదా జీవితము గడిపిరి. ఖాదియాన్‌లో విద్యావంతుల కొరతను పూడ్చుటకు ముబల్లిఘీన్ తరగతుల నుండి కొందరిని పైచదువులకు పంపుటకు హజ్రత్ ఖలీఫతుల్ మసీహుస్సాని రజియల్లాహు అన్‌హు ఆదేశించిన దరిమిలా వీరిని కూడ పై చదువులకు ఎన్నుకోనైనది. అది నాలుగు సంవత్సరముల వ్యవధి గలదైయుండెను. ఆ విద్య పూర్తి అయిన తర్వాత మే 1955లో ఖాదియాన్ లోని మదర్సా అహ్మదియ్యలో ఉపాధ్యాయులుగా నియమితులైరి. 1958లో పంజాబ్ యూనివర్సిటి నుండి మౌల్వీ ఫాజిల్ పరీక్షలో ఉత్తీర్ణులైరి. సుదీర్ఘ కాలము వరకు మదర్సా అహ్మదియ్యలో ఉపాధ్యాయులుగా సేవలందించిరి. అనంతరం సీనియర్ షాహిద్ గ్రేడ్ పొంది పదవీ విరమణ చేసిరి. అయినను చాలా కాలము వరకు మదర్సా అహ్మదియ్యలో సేవలందించినారు. నమాజ్, ఉపవాసములను పాటించేవారు, ఆచరణాత్మక విద్యావంతులుగా యుండిరి. తమ శిశువులను తండ్రిలా ప్రేమించేవారు. హదీసులపై మంచి పట్టు యుండెను. బోధించే విధానము ఎంత మంచిగా యుండెననగా విద్యార్థులకు పాఠము గుర్తుండిపోయేది. తారీఖె అహ్మదియ్యత్‌లోని 11వ సంపుటిలో ప్రచురితమైన దర్వేషుల సంఖ్య 153వ పేరు వారిదే. ముగ్గురు కుమార్తెలు, ఒక స్వంత కుమారుడు, ఒక సవతి కుమారుడు యున్నారు. వారి స్వంత కుమారుడు జమీల్ అహ్మద్ నాసిర్ న్యాయవాది. వారు సలహాదరులు, నాజిమ్ తష్‌ఖీస్, నాజిమ్ తష్‌ఖీస్ జాయిదాద్ మూసియాన్‌గా సేవలందించుచున్నారు. కుమార్తె ఆయిషా బేగం భర్త నసీమ్ అహ్మద్ గారు హాఫిజ్ ఆబాది నుస్రత్ గర్ల్స్ కళాశాల ప్రిన్సిపల్‌గా సేవలందించుచున్నారు. అల్లాహ్ తఆలా వారి స్థాయిని పెంపొందించుచు, వారి సంతానము కూడ వారి అడుగుజాడన నడుచుటకు అనుగ్రహించుగాక! (ఆమీన్)